TELTEL/12233

మన ప్రజాప్రతినిధి దినపత్రిక

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో మన ప్రజా ప్రతినిధి దినపత్రికకు, టీ.వి ఛానల్ కు జిల్లాల వారీగా, స్టాఫ్ రిపోర్టర్ మరియు మండలాలకు రిపోర్టర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను అనుభవం ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
7382966665
7382566600

ఎడిటర్ : జి.శ్రీనివాస్ సంపుటి : 2 సంచిక : 57 శనివారం, డిసెంబర్ 21 2024, పేజీలు - 4 వెల : 2/- https://epaper.manaprajaprathinidhi.com PUBLISHED FROM : TELANGANA / ANDHRAPRADESH

## తెలంగాణ శాసనసభలో
# తీవ్ర గందరగోళం

- ఈ కార్ రేసింగ్‌పై చర్చకు బిఆర్ఎస్ పట్టు
- భూభారతిపై చర్చను అడ్డుకునే యత్నం
- స్పీకర్‌పై పేపర్లు చించి విసిరిన సభ్యులు
- నిరసన తెలుపుతూ సభ నుంచి వాకౌట్




**హైదరాబాద్,డిసెంబర్20:** తెలంగాణ శాసనసభలో తీవ్ర గందర గోళం నెలకొంది. ఫార్ములా ఈ–రేసుపై ఏసీబీ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ భారాస ఎమ్మెల్యేలు చర్చకు పట్టుబట్టారు. ఈ క్రమంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం, తదితర పరిణామాలతో సభలో గందరగోళం ఏర్పడింది. దీంతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ సభను 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. ఫార్ములా ఈ–రేసుపై ఏసీబీ కేసు నమోదు చేయడం.. దీనిలో ఏ–1గా భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేరును



చేర్చడంపై ఆ పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభలో నిరసన వ్యక్తం చేశారు. ఫార్ములా ఈ–రేసు అంశంపై చర్చకు పట్టుబట్టారు. దీంతో స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ భూ భారతి బిల్లుపై ప్రభుత్వం చర్చకు సిద్ధమైన నేపథ్యంలో తర్వాత నిర్ణయం తీసుకుందామని భారాస సభ్యులను ఉద్దేశించి చెప్పారు. ఫార్ములా ఈ–రేసు అంశం ఒక వ్యక్తికి సంబంధించినదని.. భూ భారతి బిల్లు రాష్ట్ర ప్రజలకు చెందినదని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు భారాస సభ్యులు యత్నించారు. వారిని మార్షల్స్ అడ్డుకున్నారు. దీంతో పలువురు భారాస ఎమ్మెల్యేలు పేపర్లు చించి సభాపతి వైపు విసిరారు. అదే సమయంలో కొందరు కాంగ్రెస్ సభ్యులు పేపర్లు చించి భారాస వైపు విసరడంతో సభలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. అంత కుముందు భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అసెంబ్లీ జరుగుతున్న సమయంలో ఒక ఎమ్మెల్యేపై అక్రమ కేసు పెట్టారు. కేటీఆర్‌ను అప్రతిష్ఠ పాల్జేసి భారాసను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. ఈ అంశంపై రకరకాల లీకులు ఇస్తున్నారు. మేం ఎలాంటి తప్పు చేయలేదు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఫార్ములా ఈ–రేసుపై నిర్ణయం తీసుకున్నాం. మేం తప్పు చేశామంటున్నారు.. దీనిపై సభలో చర్చించి ఆ తప్పేంటో చెప్పాలి. పెట్టింది అక్రమ కేసు కాకుంటే వెంటనే సభలో చర్చించాలి. మేం తప్పు చేయలేదని కేటీఆర్ చెప్పారు.

మిగతా 2లో...

## ఈ-ఫార్ములా సంస్థతో కేటీఆర్ లోపాయికారీ
# ఒప్పందం

- రూ. 600 కోట్లు లూటీకే ఫార్ములా ఈ-రేస్
- విచారణలో ఉన్నందున వివరాలు వెల్లడించలేను
- సభలో సిఎం రేవంత్ రెడ్డి వివరణ



**హైదరాబాద్,డిసెంబర్20** ఈ–ఫార్ములా సంస్థతో జరిగిన కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం అంతా ప్రజల ముందు పెడతానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీలో కేటీఆర్ ఈ–ఫార్ములా కేసుపై సీఎం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ బీఏసీ మీటింగ్‌లో 9 అంశాలు ఇచ్చారు.. దీంట్లో ఈ ఫార్ములా గురించి ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఈ ఫార్ములా ప్రతినిధి తనను కలిశారని.. ఎవరు వచ్చినా అందరినీ కలుస్తానని చెప్పారు. ఈ ఫార్ములా ప్రతినిధిని తన ఇంట్లో కలిశానని అన్నారు. తనకేం సంబంధం అని అడిగానన్నారు. కేటీఆర్‌తో అంత సెటిల్ చేసుకున్నానని ఫార్ములా ప్రతినిధి అన్నారు.. అధికారులతో మాట్లాడి చెప్తా అన్నానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ–కార్ రేస్ ప్రతినిధి తనను కలవడంతోనే ఈ బండారం బయటపడిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఏసీబీ విచారణలో ఉన్నందున ఇప్పుడు పూర్తి వివరాలు చెప్పలేనని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఇక్కడ తానేం చెప్పినా కోర్టుకు వెళ్లి సీఎం తన మీద కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని కోర్టుకు చెప్పుకుందాం అనుకుంటున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఫార్ములా సంస్థతో జరిగిన కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం అంతా ప్రజల ముందు పెడతానని పేర్కొన్నారు. వెంటనే విచారణ జరపాలని..

మిగతా 2లో...

## హైకోర్టులో కెటిఆర్‌కు
# స్వల్ప ఊరట

- 30 వరకు అరెస్ట్ చేయవద్దని ఆదేశం
- క్వాష్ పిటిషన్‌పై వాదనలు విన్న కోర్టు
- తదుపరి విచారణ 27కు వాయిదా



**హైదరాబాద్,డిసెంబర్ 20:** భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. ఫార్ములా–ఈ కార్ రేస్ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ జరిగింది. ఇరు వైపులా వాదనలు విన్న ధర్మాసనం.. ఈనెల 30 వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దని ఆదేశించింది. కేటీఆర్‌పై ఏసీబీ నమోదు చేసిన కేసులో దర్యాప్తు కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. పది రోజుల్లో కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ధర్మాసనం ఈనెల 27కి వాయిదా వేసింది. అయితే ప్రాథమిక దర్యాప్తు ఇప్పటికే పూర్తయినందున మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కేటీఆర్ తరఫున సుప్రీంకోర్టు


మిగతా 2లో...

## భూభారతి బిల్లుకు శాసనసభ
# ఆమోదం

- వాడీవేడి చర్చ అనంతరం సభ తీర్మానం
- ధరణిపై సిబిఐ విచారణకు బిజెపి డిమాండ్
- ప్రతి సమస్యా భూమితో ముడిపడి ఉంది
- భూమికోసం ఎన్నో పోరాటాలు సాగాయి
- ప్రజల ఆత్మగౌరవం నిలబెట్టేది భూమి
- ధరణితో విదేశీ కంపెనీల చేతికి వివరాలు
- సభలో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- బిఆర్ఎస్ సభ్యుల తీరుపై ఆగ్రహం

**హైదరాబాద్,డిసెంబర్20:** తెలంగాణ అసెంబ్లీలో భూభారతి బిల్లు – 2024 ఆమోదం పొందింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బిల్లును ప్రవేశపెట్టారు. భూ భారతి బిల్లు ప్రవేశ పెట్టే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. బిల్లు ఆమోదం పొందుతుండటంతో ఆనంద భాష్పాలు వస్తున్నాయన్నారు. సభలో భూ భారతి బిల్లు ప్రవేశ పెట్టిన మంత్రి..బిల్లును పాస్ చేయాల్సిందిగా స్పీకర్ ను కోరారు. సభ్యులు ఆమోదిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అనంతరం అసెంబ్లీని స్పీకర్ శనివారానికి వాయిదా వేశారు. భూభారతిపై చర్చ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రతి సమస్య భూమితోనే ముడిపడి ఉందని అన్నారు. తెలంగాణలో ప్రజల ఆత్మగౌరవం నిలబెట్టేది భూమి. భూమిని కాపాడుకునే ప్రయత్నంలో దొడ్డి కొమరయ్య వంటి వారు ప్రాణాలు కోల్పోయారు.

మిగతా 2లో...








## హైకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్

**హైదరాబాద్, డిసెంబర్ 20 :** తనపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఫార్ములా–ఈ రేస్ వ్యవహారంలో ఏసీబీ కేసుపై క్వాష్ పిటిషన్ వేశారు. ఈ మేరకు కేటీఆర్ తరఫు లాయర్లు జస్టిస్ శ్రవణ్ కుమార్ బెంచ్ ముందు లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. భోజన విరామం తర్వాత పిటిషన్‌ను విచారించాలని కోరారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ పిటిషన్‌పై హైకోర్టు నేడు విచారించనుంది. కాగా, లంచ్ మోషన్‌ను సింగిల్ బెంచ్ తిరస్కరించడంతో.. సీజే బెంచ్ ముందు పిటిషన్‌ను దాఖలు చేశారు. కాంగ్రెస్ సర్కార్ కుటిల ప్రయత్నంతో ఫార్ములా ఈ–కార్ రేసులో కేటీఆర్‌పై కేసు నమోదైంది. ఈ–కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్లు దుర్వినియోగం

మిగతా 2లో...

## వచ్చే ఐదేళ్లలో ఈవీ రంగం
# వేగంగా అభివృద్ధి

- 2030 నాటికి రూ.20 లక్షల కోట్ల స్థాయికి..
- ఉద్యోగాల కల్పన కూడా ఎన్నో రెట్లు పెరుగుతుంది
- భారత్‌లో ప్రారంభ దశలోనే ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు
- వాహన విక్రయాలలో సింగిల్ డిజిట్ మార్కెట్ వాటాలు
- కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి గడ్కరీ వెల్లడి



**న్యూఢిల్లీ, డిసెంబర్ 20:** భారత్ ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఈవీ) రంగం వచ్చే ఐదేళ్లలో వేగంగా అభివృద్ధి చెందుతుందని, 2030 నాటికి రూ.20 లక్షల కోట్ల స్థాయికి చేరే అవకాశం ఉందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ గురువారం (డిసెంబరు 19) వెల్లడించారు. ఉద్యోగాల కల్పన కూడా ఎన్నో రెట్లు పెరుగుతుందని అంచనా వేశారు. భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు ఇప్పటికీ ప్రారంభ దశలోనే ఉన్నాయి. మొత్తం వాహన విక్రయాలలో సింగిల్ డిజిట్ మార్కెట్ వాటాలు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ – డిసెంబర్ మధ్య 18 లక్షలకు పైగా రిజిస్టర్ అయినట్లు

మిగతా 2లో...

## మహిళల సంక్షేమం కోసమే చట్టాలు



భర్తలను బెదిరించడానికి కాదు కుటుంబానికి బలమైన పునాదిగా వివాహ వ్యవస్థ

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

వివరాలు 2లో



## తొలి అడుగులోనే కేటీఆర్ నైతిక విజయం

మాజీమంత్రి హరీష్ రావు వెల్లడి

వివరాలు 2లో

## బిఆర్ఎస్‌ది కచరా
# గవర్నమెంట్

- ధరణిని వారి కుటుంబం కోసం తెచ్చారు
- భూములపై ఆడిటింగ్ చేయాలన్న పట్టించుకోలే
- అసెంబ్లీలో బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ అక్బరుద్దీన్



**హైదరాబాద్,డిసెంబర్20:** ధరణి ఓ కుటుంబం కోసం తెచ్చిందని, దాంతో ప్రజలు ఎలాంటి లబ్ది పొందలేదని ఎంఐఎం సభ్యుడు అక్బరుద్దీన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఫార్ములా ఈ–రేసు అంశంపై చర్చకు భారాస సభ్యులు పట్టుబట్టడంతో పాటు స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు యత్నించడంతో సభలో కాసేపు గందరగోళ

మిగతా 2లో...

(మొదటి పేజీ తరువాయి)

## ఈ-ఫార్ములా సంస్థతో

అధికారులకు సూచించానన్నారు. ఇప్పటి వరకు నాలుగుసార్లు సభ జరిగింది.. కానీ దీని గురించి చర్చకి అడగలేదని అన్నారు. ట్విట్టర్ పిట్ట ఇన్నాళ్లు ఎక్కడ పోయాడు.. బీఆర్ఎస్ వాళ్లకు మెదడు కూడా పోయినట్టు ఉందని సీఎం దుయ్యబట్టారు. ఎక్కడికైనా వస్తా.. చర్చ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అవసరం అనుకుంటే వాళ్ల పార్టీ ఆఫీస్ కి ఐనా వెళ్తానని తెలిపారు. హెచ్ఎండీఏ ఖాతాలోని డబ్బులు లండన్ కంపెనీకి ఎలా వెళ్ళాయని సీఎం అడిగారు. ఈ- కార్ రేస్ అగ్రిమెంట్ రూ.55 కోట్లు కాదు.. రూ.600 కోట్లు అని ముఖ్యమంత్రి తెలిపారు. రూ. 600 కోట్లు లూటీ చేయాలని ఫార్ములా ఈ-రేస్ తెచ్చారని సీఎం పేర్కొన్నారు. నగదు బదిలీ చేయాలంటే ఆర్బీఐ అనుమతి ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఓఆర్ఆర్ టెండర్లు రద్దు చేయండని అంటున్నారు.. విచారణ జరగకుండా రద్దు చేస్తారా..? అని సీఎం ప్రశ్నించారు. విచారణ అడిగింది వాళ్ళే.. డిమాండ్ చేసింది వాళ్ళేనని సీఎం తెలిపారు. చర్చకు నేను వెనక్కి పోయే వాడినా అధ్యక్షా.. దేని మీద నైనా చర్చకు సిద్ధంగా ఉంటానని ముఖ్యమంత్రి చెప్పారు. హరీష్ రావు అడిగితేనే ఓఆర్ఆర్ పై సిట్ వేశామన్నారు. ఈ విషయంపై కేసీఆర్ ఇంట్లో గొడవ జరిగిందని తెలిపారు. ఇంటికి వెళ్లాక హరీష్ కు కొరడా దెబ్బలు ఉంటాయన్నారు. హరీష్ బాధను తాను అర్థం చేసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

## తెలంగాణ శాసనసభలో....

రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఫార్ములా ఈ-రేసుపై నిర్ణయం తీసుకున్నాం. మేం తప్పు చేశామంటున్నారు.. దీనిపై సభలో చర్చించి ఆ తప్పేంటో చెప్పాలి. పెట్టింది అక్రమ కేసు కాకుంటే వెంటనే సభలో చర్చించాలి. మేం తప్పు చేయలేదని కేటీఆర్ చెప్పారు. ఈ విషయంలో స్పష్టమైన హామీ ఇస్తే సహకరిస్తాం'అని హరీశ్‌రావు అన్నారు. అయితే స్పీకర్ వారిని వారించినా వినలేదు. భూభారతిపై చర్చకు పల్లా రాజేశ్వర్ రెడ్డికి అవకాశం ఇచ్చినా మాట్లాడలేదు. అనంతరం నినాదాలు చేస్తూ శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. ఫార్ములా ఈ రేసుపై చర్చ జరపాలని బీఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీలో పట్టుబట్టారు. కానీ ప్రభుత్వం దానికి అనుమతించకపోవడంతో వారు సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ప్రపంచస్థాయిలో తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను పెంచే లక్ష్యంతో హైదరాబాద్ నగరానికి ఫార్ములా ఈ కారు రేసింగ్‌ను కేటీఆర్ తీసుకొస్తే.. ఆయనపై అక్రమ కేసులు పెట్టడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. ఈ అంశంపై చర్చకు పెడితేనే నిజానిజాలు ప్రజలకు తెలుస్తాయని పేర్కొన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఫార్ములా ఈ కారు రేసింగ్‌పై చర్చకు అనుమతించకపోవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. ఈ క్రమంలోనే సభ నుంచి వాకౌట్ చేశారు.


## హైకోర్టులో కెటిఆర్‌కు స్వల్ప ఊరట

సీనియర్ న్యాయవాది సుందరం, ప్రభాకర్‌రావు, గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపించారు. అవినీతి నిరోధక చట్టం కింద పెట్టిన సెక్షన్లు ఈ కేసుకు వర్తించవని, ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని కోరారు. 'అవినీతి నిరోధక చట్టం కింద పెట్టిన సెక్షన్లు ఈ కేసుకు వర్తించవు. ముఖ్యంగా 13(1)(జీ) సెక్షన్ ఈ కేసుకు వర్తించదు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని అనేందుకు ఆధారాలు లేవు. ప్రొసీజర్ పాటించలేదనడం సరైంది కాదు. 14 నెలల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రాథమిక విచారణ కూడా లేకుండా కేసు పెట్టారు. కేవలం రాజకీయ కక్షసాధింపు కోసమే కేటీఆర్‌పై కేసు పెట్టారు. ఈ కేసులో ఎన్నో తప్పులు కనిపిస్తున్నాయి. కార్ రేస్ నిర్వహణకు 2022 అక్టోబరు 25న ఒప్పందం జరిగింది. సీజన్ 10 నిర్వహణకు స్పాన్సర్ వెనక్కి తగ్గారు. రేస్ నిర్వహణలో ఇబ్బందుల నివారణకే ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఇబ్బందులు రాకూడదనే హెచ్ఎండీఏ చెల్లింపులు చేసిందని వాదించారు. సీజన్-9 వల్ల దాదాపు రూ.700 కోట్ల లాభం వచ్చింది. ఆర్థికశాఖ అనుమతి లేదని ఏసీబీ అధికారులు అంటున్నారు. కార్ రేసింగ్ ఒప్పందాన్ని కొత్త ప్రభుత్వం ఉల్లంఘించింది. కొత్త ప్రభుత్వం డబ్బు చెల్లించకపోవడంతో ఒప్పందం రద్దయింది. ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యానికి కారణాలు చెప్పలేదు. సుప్రీం తీర్పుల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యం తగదు. ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు ప్రాథమిక విచారణ అవసరమని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయి. సుప్రీంకోర్టు తీర్పులను ఏసీబీ అధికారులు పట్టించుకోలేదు. ప్రజాప్రతినిధిపై కేసుకు ముందు ప్రాథమిక విచారణ చేయాలి. 18న ఫిర్యాదు అందగానే.. 19న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేటీఆర్ స్పెక్యులేషన్ చేసినట్టు ఎక్కడా పేర్కొనలేదు. అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పలేదు. కానీ, అవినీతి నిరోధక చట్టం కింద కేసు పెట్టారు' అని కేటీఆర్ తరఫు న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'ఎఫ్ఐఆర్ నమోదు ప్రాథమిక అంశం మాత్రమే. అందులో పేర్కొన్న అంశాలే అంతిమం కాదు. దర్యాప్తులో తేలే విషయాల ఆధారంగా సెక్షన్లు చేరుస్తారు. రెండు నెలల క్రితమే కేసు నమోదుకు నిర్ణయించారు. కేసు నమోదు కోసం గవర్నర్ నిర్ణయానికి పంపారు. గవర్నర్ ఆమోదించాకే కేసు నమోదు చేశారు. ఫార్ములా సంస్థకు డబ్బు విదేశీ కరెన్సీలో చెల్లించారు. దీంతో హెచ్ఎండీఏపై అధిక భారం పడింది. విదేశీ కరెన్సీలో చెల్లింపు కోసం ఆర్బీఐ అనుమతి తీసుకోలేదు. ఆర్థికశాఖ అనుమతి కూడా లేదు' అని ఏజీ వివరించారు. గవర్నర్ అనుమతి కాపీని కోర్టు అడగడంతో ఏజీ అందజేశారు. చెల్లింపుల్లో కేటీఆర్ పాత్ర ఏంటని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. కేటీఆర్ పాత్ర ఏంటో దర్యాప్తులో తేలుతుందని ఏజీ తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు అనేది దర్యాప్తు కోసమేనని వివరించారు. కేసు పూర్తి వివరాలు అభియోగపత్రంలో ఉంటాయని, రూ.56 కోట్లకు పైగా చెల్లింపుల్లో నిబంధన ఉల్లంఘన జరిగిందని ఏజీ కోర్టు దృష్టికి తెచ్చారు. ఫార్ములా ఈ-కార్ రేస్‌లో కేటీఆర్‌పై ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసును కొట్టివేయాలని మాజీ మంత్రి పిటిషన్ వేశారు.

## బిఆర్ఎస్‌ది కచరా గవర్నమెంట్

పరిస్థితులు నెలకొన్నాయి. భారాస సభ్యుల తీరును ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ తప్పుబట్టారు. ఈ రోజు సభలో జరిగింది పదేళ్ల భారాస పాలనను తెలియజేస్తోందని వ్యాఖ్యానించారు. సభ్యులు ప్రజల సమ స్యలు ప్రస్తావించేందుకు సభకు వస్తారని.. ఇలా ఆందోళన చేసేందుకు కాదన్నారు. పదేళ్ల భారాస పాలన.. కచరా గవర్నెన్స్ అని ఘాటు వ్యాఖ్యలు చేశారు.'ఇవాళ సభలో జరిగింది భారాస సంస్కృతికి నిదర్శనం. భారాస సభ్యులకు కేసీఆర్ బోధించింది ఇదేనా? ధరణి.. ఒక కుటుంబం కోసం.. ఒక పార్టీ కోసమే తెచ్చారు. భూముల ఆడిటింగ్ జరగాలని పదేళ్లుగా డిమాండ్ చేస్తున్నా. నా డిమాండ్‌ను భారాస ఏనాడూ పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా భూముల ఆడిటింగ్ చేయాలి' అని అక్బరుద్దీన్ కోరారు. సభలో చర్చ కొనసాగుతుండగానే భారాస సభ్యులు వాకౌట్ చేశారు. సభలో భారాస సభ్యుల తీరు ఏమాత్రం బాగోలేదని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. భారాస నేతలు పదేళ్ల పాటు తెలంగాణ ప్రజల గొంతు నొక్కేశారని మండిపడ్డారు. 'మా గొంతు నొక్కే అధికారం మీకు ఎవరిచ్చారు? తప్పుడు కేసు పెట్టారని కేటీఆర్ భావిస్తే నిరాహార దీక్ష చేయవచ్చు కదాఅలా చేస్తే కనీసం సానుభూతి అయినా వస్తుంది' అని కూనంనేని అన్నారు.

## హైకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్




చేశారనే అభియోగంతో కేటీఆర్‌పై ఎంఏయూడీ సెక్రటరీ దానకిశోర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి ఫిర్యాదు చేశారు. దీంతో కేటీఆర్‌పై ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదుచేసింది. ఎన్నికల నియమావళిని ధిక్కరిస్తూ, ప్రభుత్వ అనుమతి లేకుండా, ముందస్తు సమాచారం ఇవ్వకుండా రూ.54,88,87,043 కోట్లను యూకేకు చెందిన 'ఫార్ములా ఈ ఆపరేషన్స్ లిమిటెడ్' (ఎఫ్ఈఓ) కంపెనీకి హిమాయత్‌నగర్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు నుంచి బదిలీ చేయించారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్, ఏ2గా సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఇతరులపై కేసు నమోదు చేశారు. ఐసీపీ (బీఎన్ఎస్) 13(1)(ఏ), 13(2), సీపీయాక్ట్ 409, 120 (బీ) సెక్షన్స్ కింద అభియోగాలు మోపారు. ఈ మేరకు నాంపల్లి ఏసీబీ కోర్టుకు ఏసీబీ అధికారులు వివరణ ఇచ్చారు. రూ.10 కోట్లకు మించి బదిలీ జరిగితే ప్రభుత్వం, ఆర్థికశాఖ అనుమతి అవసరమని, సీజన్ 10 ఫార్ములా ఈ రేసింగ్‌కు స్పాన్సర్స్ లేక పోవడంతో హెచ్ఎండీఏ నిధులు మళ్లించారని, దీంతో విదేశీ కంపెనీకి చెల్లింపులతో హెచ్ఎండీఏకు అదనపు పన్ను భారమైందని దానకిశోర్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

# భూభారతి బిల్లుకు శాసనసభ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మల్లు స్వరాజ్యం లాంటి అనేక మంది భూ పోరాటాలు చేశారు. పేదల భూములు కాపాడేందుకు పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేశారు. భూమిలేని పేదలకు ఇందిరాగాంధీ ప్రభుత్వ భూమి ఇచ్చి ఆత్మగౌరవం నిలబెట్టింది. ఆక్రమణలు తొలగించి రైతుల హక్కులు కాపాడేందుకు గత ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు తెచ్చాయని అన్నారు. భూభారతిపై వాడీవేడిగా చర్చ సాగింది. బిల్లుపై విపక్ష బిఆర్ఎస్ సభ్యులు చర్చించకుండా ఆందోళనకు దిగారు. బిల్లుపై చర్చించాలని, ఇది రైతులకు సంబంధించినదని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పదేపదే సూచించారు. భూముల అన్యాక్రాంతం, లక్షల కోట్ల అవినీతి జరిందని డిప్యూటి సిఎం భట్టి, మంత్రి పొంగులేటి ప్రకటించినా ఎందుకు సిబిఐ విచారణకు ఆదేశించలేదని బిజెపి నేతమహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. ఈ క్రమంలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు సహనం కోల్పోయి స్పీకర్ గడ్డం ప్రసాద్ పట్ల దారుణంగా వ్యవహరించారని అన్నారు. అమర్యాదగా ప్రవర్తించి సభాపతిపైనే పేపర్లు విసిరారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శాసనసభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ప్రతిపక్షం వ్యవహార శైలి, ధరణి పోర్టల్, కేసీఆర్, ఫార్ములా-ఈ కార్ రేసుపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన విషయాలు బయటపెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తనపై దారుణంగా ప్రవర్తించినా స్పీకర్ గడ్డం ప్రసాద్ మాత్రం సహనాన్ని ప్రదర్శించారని ఆయన అన్నారు. ప్రతిపక్షం అహంభావంతో వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి' మాత్రం రైతులను తమ భూములకు దూరం చేసింది. 2010లో ఒడిశా కూడా ఇదే ధరణి విధానాన్ని తీసుకొస్తే.. ఒడిశా ప్రభుత్వం తప్పు చేసిందని ఎన్ఐసీ, కాగ్ సూచించాయి. అనుభవం లేని ఐ అండ్ ఎల్ఎఫ్ఎస్ సంస్థకు అప్పగించొద్దని హెచ్చరించింది. తెలంగాణ ప్రభుత్వం మాత్రం యువరాజుకు అత్యంత సన్నిహితుడైన గాదె శ్రీధర్‌రాజు కంపెనీకి ధరణి పోర్టల్ నిర్వహణను అప్పగించారు. క్రిమినల్ కేసుల్లో ఇరుక్కున్న సంస్థలను ఐఎల్ అండ్ ఎల్ఎఫ్ఎస్ సంస్థ టేకోవర్ చేసుకుంది. అవకతవకలకు పాల్పడిన సంస్థకు ధరణి పోర్టల్ బాధ్యతను అప్పగించారు. ధరణి టెండర్ దక్కగానే ఈ సంస్థ పేరు, యాజమాన్యం మారింది. ఫాల్కన్ హెచ్‌బీ అనే ఫిలిప్పీన్ కంపెనీ, తర్వాత సింగపూర్ కంపెనీ ఇందులోకి వచ్చాయి. 50 లక్షల మంది రైతులు, వారి భూముల వివరాలను ఈ సంస్థ చేతిలో పెట్టారు. ట్యాక్స్ హెవెన్ దేశాల కంపెనీల చేతిలో మన




ధరణి పోర్టల్ పెట్టారు. ఫిలిప్పీన్స్, సింగపూర్, కెమెన్ హైలాండ్స్, వర్జిన్ ఐలాండ్ మీదుగా ధరణి పోర్టల్ తిరిగింది. పోర్టల్ నిర్వహణ ఏ కంపెనీ చేతిలోకి వెళ్లినా.. సీఈవోగా గాదె శ్రీధర్‌రాజే ఉన్నారు' అని సీఎం వివరించారు. సీఎం ప్రసంగం తర్వాత భూ భారతి బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. విపక్ష పార్టీ అహంభావంతో అహంకారంతో వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సభా మర్యాదలను ఉల్లంఘించి సభాపతిపైనే దాడి చేస్తామన్న ధోరణిలో చర్చను అడ్డుకోవాలని ప్రయత్నించిందన్నారు. 'రెచ్చగొట్టడం ద్వారా భూ భారతి బిల్లుపై చర్చను పక్కదోవ పట్టించాలని ప్రయత్నించినా.. చాలా ఓర్పుతో సభాపతి వ్యవహరించారు. ఏ మాత్రం సహనం కోల్పోకుండా.. వాళ్లంతట వాళ్లే సహనం చచ్చిపోయి సహకరించాల్సిన పరిస్థితి కల్పించి సభను ముందుకు నడిపించారు. తెలంగాణ రైతాంగానికి ఉపయోగపడే కీలకమైన, ముఖ్యమైన బిల్లుపై చర్చ జరిగే విధంగా కృషి చేసిన సభాపతిని అభినందిస్తున్నా' అని సీఎం తెలిపారు. అద్భుతమంటూ ధరణి పోర్టల్ తీసుకొచ్చారని, ధరణి గురించి గత ప్రభుత్వం ఎన్నో గొప్పలు చెప్పిందని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్ ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారని, కానీ వాస్తవాలు మరోలా ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఆ పోర్టల్‌ను కేసీఆర్ కనిపెట్టలేదని, 2010లోనే ఒడిశా ప్రభుత్వం ఈ-ధరణిని తీసుకొచ్చిందని సీఎం వెల్లడించారు. ఒడిశా తెచ్చిన ధరణిలో లోపాలు ఉన్నాయని కాగ్ చెప్పిందని, కాగ్ తప్పుబట్టిన ధరణిని తెలంగాణలో ఎందుకు పెట్టారని అసెంబ్లీ వేదికగా కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ తనకంటే గొప్పోళ్లు లేరని అనుకుంటారని, అందుకే ఆయన అలా ప్రవర్తిస్తారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కేటీఆర్‌కు అత్యంత సన్నిహితులకే ధరణి టెండర్లు కేటాయించారు. సత్యం రామలింగరాజు సంస్థలతో ఉన్న బంధంతోనే ధరణి పోర్టల్ తీసుకొచ్చారు. ధరణి నిర్వహణలో మన రాష్ట్ర పౌరులు ఎవరూ లేరు. కనీసం పక్క రాష్ట్రాలకు చెందిన వారూ లేరు. టీఎస్‌టీఎస్ ఆధ్వర్యంలోనే ధరణి టెండర్లు వేశారు. ఐటీ శాఖ పరిధిలోనే టీఎస్‌టీఎస్ ఉంటుంది. ఆర్థిక నేరాలు చేసిన కంపెనీల ద్వారా డేటాను దేశం దాటించారు. ప్రజలను మోసం చేసి సమాచారాన్ని క్రిమినల్స్‌కు అందించారు. ఈ నేరాలకు ఏం శిక్ష విధించాలో తెలియాలంటే చట్టాలన్నీ చదవాలి. ధరణిలోకి డజన్ల కొద్దీ కంపెనీలు ఎందుకు వచ్చాయి?. మన భూముల సమాచారం మొత్తం విదేశాల్లో ఉంది. రెవెన్యూ శాఖ, సీఎం దగ్గర ఉండాల్సిన సమాచారం విదేశాలకు వెళ్లింది. ఇన్ని అవకతవకలు ఉన్నా అద్భుతమంటూ ఎన్నికల్లో మాట్లాడారు. ఇవన్నీ మేము గత ఎన్నికల ముందే చెప్పాం. ధరణిలో మార్పులు చేయాలంటే ప్రభుత్వ అనుమతి ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించి కంపెనీలు ఒప్పందం చేసుకున్నాయి. ధరణి పేరుతో వాళ్ల అరాచం, దుర్మార్గం చెప్పలేని స్థాయికి చేరింది. అనుమతి లేకుండా వ్యక్తిగత సమాచార సేకరణ నేరం. గాదె శ్రీధర్‌రావు ద్వారా విదేశాలకు సమాచారం పంపించారు. వాళ్లు ఒక్క క్లిక్ కొడితే సమాచారం మొత్తం నాశనమవుతుంది.

## వచ్చే ఐదేళ్లలో ఈవీ రంగం వేగంగా అభివృద్ధి

తెలిపారు. ఇది మొత్తం వాహనాల అమ్మకాలలో 10 శాతం కంటే చాలా తక్కువ. భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు ఇప్పటికీ ప్రారంభ దశలోనే ఉన్నాయి, మొత్తం వాహన విక్రయాలలో సింగిల్ డిజిట్ మార్కెట్ వాటాతో ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ మరియు డిసెంబర్ మధ్య 18 లక్షలకు పైగా %జుఎ%లు రిజిస్టర్ అయ్యాయి, విభాగాల్లో మొత్తం వాహనాల అమ్మకాలలో 10 శాతం కంటే తక్కువ. కానీ 2030 నాటికి పరిస్థితి పూర్తిగా మారుతుందని మంత్రి అన్నారు. ఈవీ పర్యావరణ వ్యవస్థలో సుమారు 5 కోట్ల ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేశారు. ప్రస్తుతం రూ.4.50 లక్షల కోట్లుగా ఉన్న మార్కెట్ ఐదు రెట్లు పెరిగి 2023 నాటికి రూ.20 లక్షల కోట్ల మార్కెట్‌కు చేరుకుంటుందని, భవిష్యత్తులో భారత్ గ్లోబల్ ఈవీ హబ్‌గా మారాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈవీల ఫైనాన్స్ మార్కెట్ పరిమాణం కూడా రూ.4 లక్షల కోట్లకు చేరొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం '8వ క్యాటలిస్ట్ కాన్ఫరెన్స్ ఆన్ సస్టెయినబిలిటీ ఆఫ్ ఈవీ వెహికల్ ఇండస్ట్రీ- ఈవీఎక్స్‌పో 2024' సమావేశంలో మంత్రి ఈ మేరకు వెల్లడించారు. రవాణా రంగం నుంచే 40 శాతం వాయు కాలుష్యం నమోదవుతోందని, అలాగే శిలాజ ఇంధనాల దిగుమతులు రూ.22 లక్షల కోట్ల స్థాయికి చేరినట్లు తెలిపారు. ఇది అతి పెద్ద ఆర్థిక సవాలుగా ఇది మారిందని వివరించారు. అందువల్లనే కేంద్ర ప్రభుత్వం హరిత ఇంధనంపై అధికంగా దృష్టి సారిస్తోందని, మొత్తం విద్యుత్‌లో 44 శాతం సౌర విద్యుత్ ఉండేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. జల విద్యుత్, సౌర విద్యుత్, హరిత విద్యుత్ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.

# మహిళల సంక్షేమం కోసమే చట్టాలు

### భర్తలను బెదిరించడానికి కాదు ౧
### - కుటుంబానికి బలమైన పునాదిగా వివాహ వ్యవస్థ
### సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 20:** వివాహ వ్యవస్థను హిందువులు పవిత్రమైనదిగా, కుటుంబానికి బలమైన పునాదిగా భావిస్తారని సుప్రీంకోర్టు పేర్కొంది. అది వ్యాపార సాధనం కాదని తెలిపింది. మహిళల సంక్షేమం కోసమే ప్రభుత్వాలు కఠినమైన చట్ట నిబంధనలను రూపొందించాయని వ్యాఖ్యానించింది. అంతే కానీ భర్తలను వేధించి, బెదిరించి, శిక్షించి, ఆస్తిని దండుకోవడానికి కాదని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం గురువారం స్పష్టం చేసింది. భార్యను క్రూరంగా హింసించారని, వేధింపులకు గురిచేశారని, అత్యాచారం చేశారనే ఆరోపణలన్నింటినీ ప్యాకేజీగా కూర్చి నేర శిక్షాస్మృతిలోని సెక్షన్ల ప్రకారం భర్త, అతడి కుటుంబ సభ్యులపై కేసులు పెడుతున్నారని ధర్మానం పేర్కొంది. తీవ్ర మనస్పర్థలతో విడివిడిగా నివసిస్తున్న దంపతుల వైవాహిక బంధాన్ని రద్దు చేస్తూ ధర్మాసనం పలు వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో భార్యకు శాశ్వత భరణం కింద రూ.12 కోట్లను నెలలోగా చెల్లించాలని భర్తను ఆదేశించింది. అతడిపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేసింది. భార్య తరఫున గట్టిగా బేరసారాలు చేసేందుకు భర్త, అతని కుటుంబ సభ్యులపై తీవ్రమైన నేరారోపణలు చేయటం కూడా పరిపాటిగా మారిందని ధర్మాసనం ఆక్షేపించింది. ఈ డిమాండ్లలో అత్యధికంగా ఆర్థికపరమైనవే ఉంటున్నాయని ధర్మాసనం తెలిపింది. గృహ హింస ఫిర్యాదులతో రంగంలోకి దిగే పోలీసులు కూడా భర్త తరఫు బంధువుల్లో వృద్ధులను, అనారోగ్యంతో ఉన్నవారిని కూడా అరెస్టు చేసి బెయిల్ రాకుండా చేస్తున్నారని, ఈ ఘటనలన్నీ గొలుసుకట్టు మాదిరిగా ఉంటాయని పేర్కొంది. తన భర్తకు రూ.5 వేల కోట్ల ఆస్తులున్నాయని, అతడి తొలి భార్యకు రూ.500 కోట్లను భరణంగా ఇచ్చారు కనుక తనకూ అదే స్థాయిలో చెల్లించాలన్న పిటిషనర్ వాదనలను ధర్మాసనం తోసిపుచ్చింది. ?

# తొలి అడుగులోనే కేటీఆర్ నైతిక విజయం

### మాజీమంత్రి హరీష్ రావు వెల్లడి



**హైదరాబాద్,డిసెంబర్20:** తొలి అడుగులోనే కేటీఆర్ నైతిక విజయం సాధించారని, అందుకు అభినందనలు తెలియజేస్తున్నానని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. హైకోర్టులో కెటిఆర్‌కు అనుకూలంగా పరిస్థితి ఉందని అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఇది డొల్ల కేసు అని మొదటి అడుగులోనే స్పష్టమైంది. సీఎం రేవంత్‌రెడ్డి ఫార్ములా-ఈ రేసు అంశంపై అసెంబ్లీలో పచ్చి అబద్దాలు మాట్లాడారు. ఫార్ములా-ఈ రేసింగ్‌పై అసెంబ్లీలో చర్చించాలని కోరితే.. భారాస సభ్యులను సభ నుంచి బయటకు పంపి చర్చించారు. ఫార్ములా-ఈ రేస్‌కు మూడో విడత కింద 50 శాతం నిధులు.. 45 లక్షల పౌండ్లు చెల్లించకపోవడం వల్ల అగ్రిమెంట్ రద్దు చేసుకుంటున్నామని ఏవీవీ కంపెనీ డిసెంబరు 22న దాన కిశోర్‌కు లేఖ రాసింది. 50శాతం నిధులు అంటే కేవలం రూ.45 కోట్లు మాత్రమే. నిధుల చెల్లింపుల్లో ఇర్రెగ్యులారిటీ తప్ప.. ఇల్లీగల్ మాత్రం లేదు. రేసింగ్ నిర్వహించిన సంస్థకు హెచ్ఎండీఏ నుంచి చెల్లింపులు జరిగాయి. ఫార్ములా రేసింగ్ నిర్వహించేందుకు 192 దేశాలు పోటీపడ్డాయి. రేసింగ్ కోసం మొదటి దఫాలో రూ.30కోట్లు ఖర్చు పెడితే జీఎస్టీ రూపంలో రాష్ట్ర ఖజానాకు రూ.71 కోట్లు వచ్చింది. మూడో విడతలో రూ.45 కోట్లు చెల్లిస్తే.. రాష్ట్రానికి రూ.600 కోట్ల లాభం వచ్చేది. ఫార్ములా-ఈ కార్ రేసింగ్ వల్ల తెలంగాణ ప్రతిష్ఠ పెరిగింది. తమిళనాడు ప్రభుత్వం ఫార్ములా-4 నిర్వహించి రూ.140 కోట్లు ఖర్చు పెట్టింది. చంద్రబాబు ప్రభుత్వం రూ.120 కోట్లు ఖర్చు పెట్టి ఆఫ్రో-ఏసియన్ గేమ్స్ నిర్వహించింది. గత ప్రభుత్వం చేసిన కార్యక్రమాలు కొనసాగొద్దని, సభలో కేటీఆర్ నిలదీయకుండా ఉండాలని అక్రమ కేసులు పెడుతున్నారు. రేవంత్‌రెడ్డి చర్యల వల్ల రాష్ట్ర పరపతి, ఇమేజ్ దెబ్బతింటోంది. తన ఏడాది పాలనా వైఫల్యం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు గిమ్మిక్కులు చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి కుటుంబం అవినీతిని ఎప్పటికప్పుడు కేటీఆర్ బయటపెడుతున్నారు. రేవంత్‌రెడ్డి చర్యల వల్ల రాష్ట్రంలో స్థిరాస్తి రంగం కుదేలైంది. మాకు కోర్టుల మీద నమ్మకం ఉంది. అక్రమ కేసులకు భయపడేది లేదు. ఫార్ములా రేసింగ్ కేసు వివరాలు ఈడీ అడిగిందని వార్తల్లో చూశాను. నిన్న నమోదు అయిన కేసులో వెంటనే ఈడీ జోక్యం వెనుక మతలబు ఏంటి? కాంగ్రెస్, భాజపా దోస్తానా స్పష్టంగా అర్థమవుతోంది. కుట్రలు చేసి కేటీఆర్‌ను జైలులో పెట్టడమే రేవంత్‌రెడ్డి లక్ష్యం. అసెంబ్లీలో చర్చ పెడితే కేసు డొల్లతనం బయటపడుతుంది' అని హరీశ్‌రావు అన్నారు.

# భూభారతిపై చర్చించకుండా అడ్డు

### బిఆర్ఎస్ సభ్యుల తీరు దారుణం - మండిపడ్డ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,డిసెంబర్20:** గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకోకుండా భారాస సభ్యులు వక్రబుద్ధితో వ్యవహరిస్తున్నారని తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. శాసనసభలో భూ భారతి బిల్లుపై చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఫార్ములా ఈ-రేసు అంశంపై చర్చకు భారాస సభ్యులు పట్టుబట్టడంతో పాటు స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు యత్నించారు. ఈ క్రమంలో వారి ఆందోళనల మధ్యే భూ భారతి బిల్లుపై పొంగులేటి తన ప్రసంగాన్ని కొనసాగించారు.భారాస సభ్యులు భూ భారతి బిల్లును ఆమోదించకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారి తీరు సభ్యసమాజం సిగ్గుపడేలా ఉంది. సభలో గూండాగిరి, దౌర్జన్యం, రౌడీయిజం లేకుండా స్పీకర్ చర్యలు చేపట్టాలి. భారాస హయాంలో తీసుకొచ్చిన 'ధరణి' పోర్టల్ తప్పులతడకగా ఉందని కేసీఆర్‌కు తెలుసు. ఆయన 80వేల పుస్తకాలు చదివారు. పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించి ధరణి పోర్టల్ రూపొందించారని అనుకునేవాళ్లం. ఆ చట్టానికి మూడేళ్లకే వందేళ్లు నిండాయి. ఇందిరమ్మ రాజ్యంలో 1971లో చేసిన చట్టం.. 49 ఏళ్లుగా ప్రజల్లో ఉంది. భూ భారతి బిల్లుకు సంబంధించి భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అనేక సూచనలు ఇచ్చారు. ఈ బిల్లు సభలో ప్రవేశపెట్టినప్పుడు ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా సూచనలు చేస్తారని ఆశించాం. అవి చట్టంలో పొందుపరచాలని భావించాం. కేసీఆర్ రాలేదు..

# ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీలు సహజం ప్రధానోపాధ్యాయులు కనుకయ్య



**మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట,డిసెంబర్ 20,**
మెదక్ జిల్లా చేగుంట మండల పరిదిలోని వెనుక తాండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జె.సరిత టీచర్, నరసింహా చారి ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు .ఈ సమావేశం కు ఏ ఏ పి సి చైర్‌పర్సన్ మంజుల సోమ్లా,మాజీ సర్పంచ్ స్వాతి శ్రీనివాస్ ప్రధానోపాధ్యాయుడు వి.కనకయ్య , జ్యోతి, అంగనివాడి టీచర్ మంజుల గ్రామస్తులందరూ హాజరైనారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కనుకయ్య మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి కి బదిలీలు సహజం, అందులో ఉపాధ్యాయ వృత్తి అనేది చాలా గొప్పదని అన్నారు, గురువులను తాను చెప్పిన పాఠశాలలో విద్యార్థులు తమ ఎల్లప్పుడు గుర్తించుకుంటారని ఆయన అన్నారు,విద్యార్థి తాను ఒక మంచి ఉదలో ఉన్నప్పుడు సార్ నేను మీ పూర్వ విద్యార్థిని అన్నప్పుడు ఆ ఉపాధ్యాయుడు యొక్క సంతోషం వెలకట్ట లేము అని ఈ సందర్భంగా అన్నారు

## రానున్న వేసవిలో విద్యుత్ ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి :- లోనావత్ రాములునాయక్(డివిజనల్ ఇంజినీర్)

**నిరంతరం ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలి :- భూక్యా ప్రసాద్ బాబు(అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్)**



**సత్తుపల్లి,మన ప్రజాప్రతినిధి న్యూస్ డిసెంబర్ 20.** రానున్న వేసవి కాలంలో విద్యుత్ ఎద్దడి రాకుండా గృహ వినియోగదారులకు,వ్యవసాయ దారులకు,కమర్షియల్ వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా చేసే దానికి ముందస్తుగా లూజ్ లైన్ లను,ఒరిగిన,విరిగిన స్తంభాలను గుర్తించి తక్షణమే రీప్లేస్మెంట్ చేసే దానికి ప్రణాలికలు సిద్ధం చేయాలని సత్తుపల్లి డివిజన్ విద్యుత్ డివిజనల్ ఇంజినీర్ లోనావత్ రాములునాయక్ ఆదేశాలు జారీ చేశారు.వేంసూరు మండల పరిధిలోని మర్లపాడు గ్రామంలో గల వేంసూరు సెక్షన్ విద్యుత్ కార్యాలయంలో వేం సూరు సెక్షన్ విద్యుత్ అధికారులతో,సిబ్బందితో సమీక్షా సమావేశం ఇంచార్జీ అసిస్టెంట్ ఇంజినీర్ జొన్నలగడ్డ అనీల్ అధ్యక్షతన నిర్వహించి రాములునాయక్ పలు సూచనలు చేశారు.అనంతరం పాల్గొన్న అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ భూక్యా ప్రసాద్ బాబు మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసే దిశగా పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో:- లైన్ ఇన్స్పెక్టర్ గంధం వెంకటేశ్వరరావు, సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ రమణారెడ్డి,లైన్ మెన్ వెంకటేశ్వరరావు,అసిస్టెంట్ లైన్ మెన్ లు లక్ష్మణ్,సాయి,రాజేష్,సబ్ ఇంజినీర్ జిలానీ, అన్ మాన్ కార్మికులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వేదశ్రీ డిగ్రీ కళాశాలలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



**మన ప్రజాప్రతినిధి/మానకొండూర్ తేదీ 20 డిసెంబర్** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రం లోని కళాశాల ఆవరణలో వేదశ్రీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బత్తిని ఆంజనేయులు ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గత సంవత్సరంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుంటూ నూతన సంవత్సరంలో అలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. అధ్యాపకులకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు ముందస్తు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఏనుగుల శ్రీనివాస్, చిలుకల రమణ రెడ్డి,కాసుపాక మౌనిక పాల్గొన్నారు.

# మనిషికి క్రమశిక్షణ ఆభరణం మానవ జన్మ బుద్ధిహీనంగా జీవించడానికి కాదు





**సత్తుపల్లి మన ప్రజాప్రతినిధి న్యూస్ డిసెంబర్ 20.**మానవ జన్మ విచ్చల విడిగా, బుద్ధిహీనంగా జీవించడానికి కాదని (ఇస్కాన్) ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్షియస్నెస్ ప్రచారకులు నవీన్ అన్నారు.వాల్యూ ఆఫ్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక విశ్వశాంతి విద్యాలయం, మదర్ తెరిసా స్కూల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్రమశిక్షణ మనిషికి ఆభరణం అని తెలిపారు. జీవితం అనే "ఫ్రూట్స్ " బాగుండాలంటే నిజాయితీ, క్రమశిక్షణ, ఉన్నత విలువలు వంటి "రూట్స్" బాగుండాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందాలని సూచించారు.భక్తి మార్గం తోనే భగవంతుని అర్థం చేసుకోగలమన్నారు.క్రమశిక్షణ ,ఏకాగ్రత, సానుకూల దృక్పథం, విలువలతో కూడిన విద్య అభ్యసించడం ద్వారా లక్ష్యాన్ని చేరుకోవచ్చని వివరించారు. విద్యార్థులలో విలువలు నింపేందుకు "వాల్యూ ఎడ్యుకేషన్" అనే పుస్తకాలను అందజేసి పరీక్షలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని తెలిపారు. మనసు నుంచే కోరికలు ఉద్భవిస్తాయి. మనసు అదుపులో ఉంచుకోవడం ద్వారా ఉన్నతంగా ఎదగవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రచారకులు కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

# ఐద్వా ఆధ్వర్యంలో సుశీల గోపాలన్ వర్ధంతి




**సత్తుపల్లి మన ప్రజాప్రతినిధి న్యూస్ డిసెంబర్ 20.** ఐద్వా అఖిలభారత మాజీ ప్రధాన కార్యదర్శి సుశీల గోపాలన్ వర్ధంతి సభ సత్తుపల్లి లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్ లో జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ అధ్యక్షతన జరిగింది. ఈ వర్ధంతి సభలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ మాట్లాడుతూ సుశీల గోపాలన్ కేరళ రాష్ట్రంలో మూడుసార్లు పార్లమెంటు సభ్యురాలుగా ఎన్నికయ్యారు అన్నారు. కొన్ని సంవత్సరాలు కేరళ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. సిపిఐఎం నిర్మాణంలో ప్రధాన బాధ్యతలు నిర్వహించిన అతికొద్దీ మంది మహిళలు ఆమె ఒకరన్నారు. మహిళా సమస్యలపై నిరంతరం పార్లమెంటులో ప్రస్తావించేవారున్నారు, ఆమె ఎల్లప్పుడూ శ్రామిక వర్గానికి సన్నిహితంగా ఉండేవారు అన్నారు. కార్మికుల సంబంధించిన అనేక సమస్యలు పార్లమెంటు ప్రస్తావించి వాటిని పరిష్కరించాలన్నారు. సుశీల గోపాలన్ స్ఫూర్తితో మహిళా సమస్యలతో పాటు ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా మనమందరం ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. ఈ వర్ధంతి సభ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి, ఐద్వా జిల్లా కార్యదర్శి బండి పద్మ, ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు బేగం, శీలం కరుణ , జాజిరి జ్యోతి, రత్నకుమారి, ఝాన్సీ, అమరావతి, సుమతి, అజిత, నాగమణి,సులోచన , తన్నీరు కృష్ణ వేణి,ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

# అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

**:జాజిరి శ్రీనివాస్ ,సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు**




**సత్తుపల్లి మన ప్రజాప్రతినిధి న్యూస్ డిసెంబర్ 20.** కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను పార్లమెంట్ సాక్షిగా అవమానించారని, ఎగతాళి చేసి అహంకారంగా మాట్లాడటాన్ని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఖండించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అమిత్ షా అంబేద్కర్ పట్ల ఆర్ఎస్ఎస్ బిజెపికి ఉన్న అవగాహనను వ్యక్తం చేశారని అట్టడుగు వర్గాల పట్ల వారి వైఖరిని చెప్పారని అన్నారు. దుర్మార్గమైన దారుణమైన అహంకార చర్యను అందరూ ఖండించాలన్నారు. ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంటు వద్ద నిరసన తెలపడం హర్షిణియమన్నారు. ఈ మతోన్మాద చర్యను సిపిఎం ఖండిస్తుందన్నారు. అమిత్ షా క్షమాపణ చెప్పాలన్నారు. ఎన్నిసార్లు అని పదేపదే అతడిని స్మరించుకుంటారు దానికి బదులుగా ఏదో ఒక హిందూ దేవుడిని స్మరించుకుంటే మీకు ఏడు జన్మలకు స్వర్గం దక్కుతుంది అనడం సిగ్గుచేటు అన్నారు. మాటికి అంబేద్కర్ పేరు ఎత్తడం వీళ్లకు పెద్ద ఫ్యాషన్ అయిపోయిందని ఎగతాళిగా మాట్లాడటం తగదన్నారు. ఎన్నికల ముందు అంబేద్కర్ పేరు జపం చేసి అధికారంలోకి వచ్చాక ఆయన పేరు ఎత్తకూడదని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. నేటి మనువాద మతోన్మాద ప్రభుత్వంలో రాజ్యాంగంపై ప్రభుత్వ రంగ సంస్థలపై దాడి జరుగుతుందన్నారు. ఈ దాడులను వ్యతిరేకిస్తూ రాజ్యాంగాన్ని కాపాడుకోవలసిన అవసరం ఉందన్నారు.




# రైలు ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపు

**నచ్చచెప్పి క్రిందికి దించిన స్టేషన్ మాస్టర్**

**మన ప్రజా ప్రతినిది తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట డిసెంబర్ 20,** మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలో ఉన్నటువంటి ( వడియారం) రైల్వేటేషన్లో జారండ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి నిలు చున్న రైలుపై ఎక్కి హై టెన్షన్ కరెంటు వైర్లను పట్టుకొని ఆత్మహత్య చేసుకుంటానని ప్రజలకు బెదిరింపుకు పాల్పడ్డాడు ఇది గమనించిన స్టేషన్ పాయింట్స్ మెన్ దేవేందర్, అతని లెక్క చెప్పి చాక చక్యంగా కిందికి దింపడంతో ప్రమాదం తప్పింది

# కుట్ర పూరితంగా కేటీఆర్ మీద అక్రమ కేసులు



**నేరేడుచర్ల (మన ప్రజాప్రతినిధి దినపత్రిక ).** బి ఆర్ యస్ కార్యాలయం నందు నిర్వహించిన సమావేశంలో హుజుర్నగర్ నియోజకవర్గ బి ఆర్ యస్ నాయకులు రాపోలు నవీన్ కుమార్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నువ్వు కేటీఆర్ ను ఒక నెలకు ఒక సంవత్సరానికో జైల్లో పెట్టగలవు కానీ రైతుల పక్షాన, ఐటీ, యువత పక్షాన, అభివృద్ధి తరఫున ఆయనను నిలబడకుండా ఆపలేవు నీకు ఆ దేవుడు కొంచెం బుద్ధి నివ్వాలని ప్రార్థిస్తున్నాము కేసీఆర్ పాలనలో పోలీస్ వ్యవస్థ అసెంబ్లీ సమావేశాలు పథకాలు అభివృద్ధిదేశానికి రోల్ మోడల్ గా నిలిచింది కానీ సంవత్సరం రేవంత్ పాలనలో రాష్ట్రం ఎలా ఉండకూడదో ఉదాహరణగా నిలిచింది బూతుల నుండి అసెంబ్లీలో చెప్పు విసిరేవరకు రేవంత్ పాలన దౌర్భాగ్యం అట్లుంది ఎట్లుండే ఎట్లయింది అని దుయ్య బట్టారు
ఈ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ ముఖ్య నాయకులు ఇనుపాల పిచ్చిరెడ్డి, బి.ఆర్ యస్ వి నియోజకవర్గ అధ్యక్షులు పల్లెపంగు నాగరాజు, సోషల్ మీడియా అధ్యక్షులు ఇంజమూరి రాజేష్, హుస్సేన్ బాయ్, పొలాగాని భరత్ గౌడ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# ప్రజల మనిషి నల్లమెట్ల బిక్షం యాదవ్



**మిర్యాలగూడ (మన ప్రజాప్రతినిధి దినపత్రిక )** ప్రజా సమస్యల పరిష్కారం కొరకు నిరంతరం తపించిన ప్రజల మనిషి నల్లమెట్ల బిక్షం యాదవ్ అని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిధూళిపాళ ధనుంజయ నాయుడు,యస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు మాడుగుల శ్రీనివాస్ సిపిఐ నల్గొండ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు అన్నారు శుక్రవారం నాడు మిర్యాలగూడ మండలం పచ్చారు గడ్డ గ్రామంలో మరణించిన దివంగత బీసీ నేత నల్లమెట్ల బిక్షం యాదవ్ పార్థివ దేహం పై పూలమాల వేసిన అనంతరం వారు మాట్లాడుతూ.... దొండ వారి గూడెం గ్రామంలోనూ, చుట్టుపక్కల గ్రామాలలో అందరికీ తలలో నాలుకగా మెలుగుతూ రైతాంగ సమస్యల పైన లిఫ్ట్ ఇరిగేషన్ ఎంప్లాయిస్ సమస్యల పైన రైతు కూలీల సమస్యలపై ముఖ్యంగా కౌలు రైతుల కొరకు రైతాంగానికి ఇన్పుట్ సబ్సిడీ కొరకు జరిగిన అనేక పోరాటాల్లో ముందుండి పోరాడారని వారు గుర్తు చేశారు. గ్రామంలో కమ్యూనిస్టు ఉద్యమం నిర్మాణం కొరకు అలాగే రైతాంగ ఉద్యమ నిర్మాణం కొరకు బీసీ హక్కుల సాధన కొరకు తన యావత్తు జీవితాన్ని అలాగే తన సర్వస్వాన్ని ఒడ్డినాడని, అలాంటి మంచి వ్యక్తి భౌతికంగా మన మధ్య లేకపోవడం అత్యంత బాధాకరమని బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ లతోపాటు అగ్రవర్ణాలలోని నిరుపేదలు అధికారంలోకి రాగలిగేట్లు చేయడమే ఆయనకు ఇచ్చే నివాళి అని వారు అన్నారు
నివాళులర్పించిన వారిలో రైతు సంఘం నాయకులు బిల్లా కనకయ్య వేములపల్లి మాజీసర్పంచి జడ మల్లయ్య బీసీ హక్కుల సాధన సమితి నాయకులు పసుపులేటి సోమయ్య దళిత హక్కుల పోరాట సమితి నాయకులు వలపట్ల వెంకన్న తదితరులు ఉన్నారు

# నూతన దంపతులను ఆశీర్వదించిన ఎమ్మార్పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బోడ సునిల్ మాదిగ



**ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక నల్లగొండ జిల్లా....నకిరేకల్ మండలం...**శాలిగౌరారం మండలం అడ్లూరు గ్రామానికి చెందిన బట్ట దానయ్య చిన్న కుమారుడి వివాహం నకిరేకల్ మండలంలో గుడిపాటి ఫంక్షన్ లో బట్ట ప్రశాంత్-పద్మవాతి ల వివాహా వేడుకల్లో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసాను...ఈ పెళ్లి వేడుకుల్లో పాల్గొన్న...ఎమ్మార్పీఎస్ నాయకులు బట్ట శ్రీను మాదిగ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బాకీ వెంకటయ్య, కారుపాటి అంబేద్కర్ మాదిగ,మణికొండ రవి తదితరులు పాల్గొన్నారు..

# బీసీ గురుకుల పాఠశాలలో మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం



**నేరేడుచర్ల,డిసెంబర్ 20 (మన ప్రజా ప్రతినిది దిన పత్రిక ):**మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని అంగన్వాడీ టీచర్ చింతమల్ల ప్రీతి అన్నారు.నషా ముక్త్ భారత అభియాన్ లో భాగంగా శుక్రవారం పట్టణంలోని రామాపురం బీసీ గురుకుల పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలన కరపత్రాన్ని ఆవిష్కరించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలు, మత్తు పదార్థాలకు అలవాటు పడితే కలిగే అనర్థాల గురించి, విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, అంగన్వాడి టీచర్ వాస అన్నమ్మ,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగం పొందిన యువకున్ని సన్మానించిన లింగారావు



**మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్** అంకిరెడ్డిపల్లి గ్రామ యువకుడు రాసుల సురేష్ గ్రూప్ ఫోర్త్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి కలెక్టరేట్ లోని ఫైనాన్స్ డిపార్ట్మెంట్లో ఉద్యోగం సాధించాడు.ఈ సందర్భంగా సురేష్ ను సన్మానించి అభినందనలు తెలిపిన కొండపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వాసరి లింగారావు, అనంతరం ఆయన మాట్లాడుతూ యువత కష్టపడి చదివి ఇలాంటి విజయాలు పొంది ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించాడు. యువత సరైన మార్గంలో వెళ్లి భవిష్యత్ పై ఒక దిశా నిర్దేశం ఎంచుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అన్నాడు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన జాబ్ క్యాలెండర్ ద్వారా ఇలాంటి అనేక ఉద్యోగాలు పొందాలని యువతకు పిలుపునిచ్చారు. యువత పక్కదారి పట్టకుండా గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు, మద్యానికి బానిసలు కాకుండా చదువులో రాణించాలాన్నారు. పట్టుదలతో చదివి గ్రూపు ఫోర్త్ లో విజయం సాధించి ఉద్యోగం సంపాదించిన సురేష్ ను స్ఫూర్తిగా తీసుకుని గ్రామంలో యువతీ యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలన్నారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్, సిద్ధులు, కనకయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సంజీవ్, మాజీవార్డ్ మెంబర్ ప్రవీణ్ కుమార్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ 100 వసంతాల ఉత్సవాలను జయప్రదం చేయండి : సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్

**సత్తుపల్లి మన ప్రజాప్రతినిధి న్యూస్ డిసెంబర్ 20.**ఎర్ర జెండా పార్టీ సిపిఐ అని దేశానికి సంపూర్ణ స్వతంత్రం కావాలని మొట్టమొదట నినదించిన పార్టీ సిపిఐ అని భారతదేశంలో అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి అనేక కార్మిక కర్షక చట్టాలు తెచ్చినటువంటి పార్టీ సిపిఐ అని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించి దున్నేవాడికే భూమి కావాలని పోరాడి తెలంగాణలో నాలుగువేల మంది కమ్యూనిస్టుల ఆత్మార్పణంతో పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పెంచిన పార్టీ సిపిఐ అని సిపిఐ 100 వసంతాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు అందులో భాగంగా ఈనెల 26వ తేదీ ఖమ్మంలో ఐదు వేల మందితో భారీ ప్రదర్శన హెడ్సెట్ వాలంటీర్ల కవాతు నిర్వహించనున్నట్లు దండి సురేష్ తెలిపారు. అదేవిధంగా ఈనెల 30వ తేదీన నల్లగొండలో రాష్ట్ర 100 వసంతాల ఉత్సవ సభను నల్లగొండలో నిర్వహిస్తున్నట్లు ఈ సభకు కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు కార్యకర్తలు సానుభూతిపరులు ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వేంసూర్ రోడ్ లో షాది ఖానా ముందు రాస్తారోకో నిర్వహించి అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. అంబేద్కర్ భారతదేశం కోసం భారతదేశంలో విభజన జాతులు కులాలు, మతాలు, పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం రాసిన రాజ్యాంగాన్ని అవమానించే పద్ధతుల్లో అంబేద్కర్ను దూషించటం



ఏమైనా చర్యని దీనికి సిపిఐ తీవ్రంగా ఖండిస్తూ అమిత్ షాను వెంటనే భద్రపు చేయాలని బిజెపి నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్మల జితేందర్ రెడ్డి సింగం నరసింహారావు లో పాల్గొని మాట్లాడుతూ భారతదేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 వసంతాలు పూర్తయిందని రానున్నప్ప కాలంలో పీడితే పక్షాన కార్మికుల పక్షాన కష్టజీవులు పక్షాన నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ కమ్యూనిస్టు పార్టీని మరింత పటిష్టపరచడానికి ఉద్యమాన్ని నిర్వహించిన తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ సత్తుపల్లి టౌన్ కార్యదర్శి నెమటూరు రామకృష్ణ మండల కార్యదర్శి యోగు జిల్లా కౌన్సిల్ సభ్యులు రామలక్ష్మి మహిళా సంఘం డివిజన్ కన్వీనర్ ఎస్ కే రంజాన్ బి జిల్లా కౌన్సిల్ సభ్యులు మద్దూర్ శ్రావణ్ నల్లమోతు నరసింహారావు ఓర్సు రమేష్ సింగరేణి యూనియన్ నాయకులు సముద్రాల సుధాకర్ ధారా భీమయ్య భాస్కర్ నారాయణరావు వైఫ్ నాయకులు అజయ్ హమీద్ లక్ష్మీ సీతమ్మ ఖమ్మంపాడు సత్యనారాయణ కేశవరావు పిల్లి బుచ్చాలు లోకా వెంకటేశ్వరావు బింగి వెంకటేశ్వరావు సిపిఐ సీనియర్ నాయకులు వెంకటేశ్వరరావు లక్ష్మీకాంతమ్మ జగన్ లాల్ మహమ్మద్ ,రమేష్ తదితరులు పాల్గొన్నారు...

# తల్లిదండ్రులారా మేల్కొనండి

**అద్భుతప్పుతున్న విద్యార్థి వ్యవస్థ,,,,,,**
**కిషోర. ప్రాయంలో అక్రమ మార్గంలోకి విద్యార్థి వర్గం,,,**
**గురువులను లెక్కచేయక సినిమా పక్కి లో బాలురు,,,,**
**పది సంవత్సరాల లోపు సిగరెట్లు అశ్లీల హెయిర్ స్టైల్ ళ్ళు చినిగుడు స్టైల్ జీన్స్,,,,**
**చదువుమని కొడితే గురువులకు వార్నింగ్,,,,,**
**పట్టించుకోని తల్లిదండ్రులు,,,,**
**బాలుర భవిష్యత్ అగమ్యగోచరమని ఒక ఉపాధ్యాయు నీ ఆవేదన, ఉత్తరం,,,,,**



**రామాయంపేట డిసెంబర్ 20:** అవేకాన్ని అజ్ఞానాన్ని మూర?త్వాన్ని ఖండించి విద్యానికే ఖడ్గం నేడు కొత్త ప్రపంచానికి విశ్వంతర ఆవిష్కరణకు మార్గదర్శకమయ్యాయి. ఎందరో ఆచార్యులు గురువులు తాము గురువుల వద్ద క్రమశిక్షణతో ఏకాగ్రతతో ఎన్నో కష్టాలకు వచ్చి కాలాన్ని వెచ్చించి సేవలు చేసి సంపాదించిన విద్యను విశ్వసేవకు విశ్వంతర ఆవిష్కరణకు అందించేందుకు ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి దేశం కాల ప్రాంతాలను నూతన చైతన్యాన్ని అందించి అవిధేను తొలగించి జ్ఞానం అనే విద్యను ప్రసాదించే ప్రక్రియ ప్రతి జీవిలోనూ జంతువులను క్రమశిక్షణతో నేర్చుకొని తమ జీవిత గమ్యాన్ని మనుగడను సాగిస్తున్నాయి అన్న నిజం మనందరికీ తెలుసు తల్లి





తండ్రి అని సింహం లాంటి పాము లాంటి కూర జంతువులు కూడా తమ సంతానానికి గురువుగా వేటను ప్రాణాలు కాపాడుకుని నైపుణ్యాలను నేర్పుతాయి అవి అడవుల్లో తమ ప్రాణాలను కాపాడుకుంటూ వేటాడడానికి ఆహారం సంపాదించుకొని తన కుటుంబాన్ని కాపాడుకునే విద్య కూడా జ్ఞాన ప్రధానమైన విద్యనే అని గుర్తించాలి. అవి క్రమశిక్షణ లేక తన గురువైన తల్లిదండ్రి మాట వినని జంతువులు ఎక్కడో ఒక అనుభవం లేక శూన్యమవుతాయి మానవ నాగరికతకు అత్యున్నతమైన జ్ఞాన సంపదకు వ్యవహారిక జీవనానికి లౌకిక నైతిక విలువలకు విద్య అత్యవసరమని సమాజం ప్రతి ఒక్కరికి ఏదో విధంగా గురువుల చేత విద్యను అందిస్తున్నది తరతరాలుగా చరిత్ర పురాణ ప్రస్తుత కాలంలో కూడా గురువుల భిక్షతోనే విద్యాభివృద్ధి అనేకమంది మేధావులు వీరులు కూడా గురువుల అనుకువతో ముందుకు వెళ్లడం జరిగింది ప్రస్తుత నడుస్తున్న చరిత్రలో విద్యార్థులు అతి చిన్న వయసునుండే అనేక దురాలవాట్లకు ప్రభుత్వ పాఠశాలలకు ప్రైవేట్ పాఠశాలల్లో కూడా కొందరు విద్యార్థులు ఇంటి నుండి వచ్చిన తర్వాత తమకు నచ్చిన విధంగా వ్యవహరిస్తున్నారనీ పాఠశాల ఉపాధ్యాయులు వాపోతున్నారు వేమన చెప్పినట్లు బుద్ధి చెప్పినవాడు గుద్దినా మేలయ్యా ఇనుప చెవ్వను వేడి చేస్తేనే అనుకున్న విధంగా రూపుదిద్దుకుంటుందని గురువు అనేవాడు శిష్యుని శిక్షణలో శిక్షించే పద్ధతి ద్వారానే మార్చడం జరుగుతుందని విదురనీతి తెలుపుతున్నది మహాపురుషులైన రాముడు అర్జునుడు కృష్ణుడు లాంటి వారికి కూడా గురువుల ద్వారానే శిక్షణా శిక్షలు విధించి అనుకరించే చరిత్రలో నిలిచిపోయారు నేడు మన ప్రాంతాల్లో ప్రైవేట్ పాఠశాలల ఉదారవైఖరి ప్రభుత్వ పాఠశాలలపై కూడా ప్రభావం చూపుతున్నాయి విద్యార్థులకు ప్రభుత్వము అన్ని విధాల సౌకర్యాలు అందించి చదువుకు మార్గం ఏర్పాటు చేసింది కానీ విద్యార్థులకు ఇంటి వద్ద తల్లిదండ్రుల భయము గురుతర బాధ్యత లోపిస్తున్నాయని మా అబ్బాయి బడికి వెళ్తున్నాడు ఎలా చదివినా పర్వాలేదు ఏం చేస్తున్నాడో కూడా పట్టించుకునే స్థితిలో లేకపోవడం వల్ల కూడా ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఉపాధ్యాయులు వాపోతున్నారు ముఖ్యంగా సెల్ఫోన్లో వాడకం అనవసరంగానే మూడు సంవత్సరాల నుండి ఫోన్లు ఇవ్వడంతో వారికి ఇంగిత జ్ఞానం కన్నా అజ్ఞానంతో కూడిన ఆటలు పాటలు లభ్యమవడంతో ఏమాత్రం కూడా మర్యాద మన్ననలకు బాలురు అలవాటు పడడం లేదని ఉపాధ్యాయులు అంటున్నారు పది సంవత్సరాలకే బైకులు కారులు బాలురకు అకారణంగా ఇవ్వడం కూడా మరో కారణం పాఠశాలల్లో చదువు ఆపకుంటే ట్యూషన్లు పెట్టి చదివిస్తామంటున్న తల్లిదండ్రులు ఎందుకు పాఠశాలలో తమ అబ్బాయిలు చదవడం లేదని ఆలోచించడం లేదు గట్టిగా ఉపాధ్యాయులు బెదిరించిన హోంవర్క్ చేయమని చెప్పిన బాలురు బయట లభిస్తున్న అజ్ఞాన పరమైన ఆటపాటలతో ఏమాత్రం పూర్తి చేయడం లేదని బెదిరిస్తే తల్లిదండ్రులు మా పిల్లలను బెదిరించవద్దు మర్యాదగా చెప్పండి అంటూ వారి ముందే ఉపాధ్యాయులను బెదిరించడంతో విద్యార్థులు మరీ రెచ్చిపోతున్నారని వారు వాపోతున్నారు ముఖ్యంగా రామాయంపేట పట్టణంలో 12 సంవత్సరాలలోపు విద్యార్థులు సిగరెట్లు తాగడంతో పాటు ఇతర అలవాట్లకు లోన అవుతున్నారు తల్లిదండ్రులు మేలుకొనకపోతే విద్యార్థుల భవిష్యత్తు పాటు తెలంగాణ మరియు అన్ని ప్రాంతాల భవిష్యత్ నేర చరిత్ర రాయబడుతున్నదని ఒక ఉపాధ్యాయుడు తన యొక్క బాధను ఒక ఉత్తరం ద్వారా అందరికీ వాట్సాప్ లో పెట్టి వీరి భవిష్యత్తు ఏమిటి తల్లిదండ్రుల ఇలా తమ పిల్లలను పట్టించుకోకపోతే విపరీత కాలం దాపరిస్తుందని బాధ వ్యక్తం చేశాడు తమ పిల్లలకు పెద్దలపట్ల మర్యాద మన్ననలు నేర్పకపోతే ఇక్కడ గురువులను కూడా వెక్కిరించడమే కాకుండా వారిని ఏమాత్రం గౌరవించకుండా వారి ముందే వెకిలి చేష్టలు చేస్తున్నారని బాధ వ్యక్తం చేస్తున్నారు విద్య ఆర్తి అనగా విద్యను అడుక్కునేవాడు అలా కాకుండా విద్యను నేర్చుకోకుండా గురువును భయపెట్టేవారుగా మారుస్తున్నారని ఉపాధ్యాయులు బాధ వ్యక్తం చేస్తున్నారు ముఖ్యంగా విద్యార్థులకు మంచి క్రాఫ్ కటింగ్ నూనె పెట్టుకుని తలదువుకొని మర్యాదగా కనిపించవలసిన విద్యార్థులు క్రాస్ కటింగ్ నీగ్రో కటింగ్ ముల్లెట్ కటింగ్ టోనీ జీన్స్ తల్లిదండ్రులు ఇలాంటి అసభ్య రూపాలకు వారి కారణమవుతున్నారని పిల్లలు ఐదు సంవత్సరాల వరకు పెంచవలసిన అవసరం అందరికీ ఉంటుందని విధులను తెలుపుతుంది ఐదు సంవత్సరాల నుండి 15 సంవత్సరాల వరకు తమ సంతానానికి భయము శిక్షణ మర్యాద క్రమశిక్షణ అందించవలసిన బాధ్యత ఉందని విదుర నీతి తెలుపుతున్నది 15 సంవత్సరాల నుండి 20 సంవత్సరాల వరకు సంతానం ఎటువంటి చెడు కార్యాలు చెడు మార్గాలు అనుసరించిన సగభాగం తల్లిదండ్రులు కూడా చెందుతుంది అంటారు శాస్త్రాలను ఏమాత్రము అనుసరించక సంప్రదాయాలను గాలికొదిలి తల్లిదండ్రులు కూడా కొంత కారణమవుతున్నారు తమ పనులను కొన్ని వదులుకొని తమ పిల్లలు ఎలాంటి మార్గాన్ని అనుసరిస్తున్నారు గుర్తించవలసిన అవసరం ఉంది లేకుంటే వారి భవిష్యత్ ముప్పావు కారణానికి తల్లిదండ్రులవుతారు అని విదుర నీతి తెలుపుతున్నది దృతరాష్ట్రునిగా దుర్యోధనుని సమాజానికి అందించి కొన్ని కోట్ల మంది ప్రాణాలను అరించిన కథ గుర్తించుకోవాలని విదుర నీతి తెలుపుతున్నది ఒక శ్రీరాముని ఒక శివాజీని ఒక వివేకానందుని అందించవలసిన అవసరం తల్లిదండ్రులకు ఎంతైనా ఉంది చేతులు కాలినంక ఆకులు పట్టుకుంటే లాభం లేదు ఇప్పటికైనా తల్లిదండ్రులు మేలుకొని తమ సంతానానికి సరైన జ్ఞానం క్రమశిక్షణ పెద్దలపై మర్యాద ఎక్కడ ఏం చేస్తున్నాడు అని వివరాలను సేకరించి తమ అడ్డుపజ్ఞలు పెట్టుకొని మంచి విద్యార్థులుగా తీర్చిదిద్దాలని ఒక ఉపాధ్యాయుడు ఆవేదనతో రాసిన ఉత్తరం అందరూ గౌరవించవలసిన అవసరం ఎంతైనా ఉంది

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక



**మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్** బందారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి హెచ్ రామచంద్రం తెలిపారు. ఈ సందర్బంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతు మండల స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు చేపట్టిన క్రీడల్లో చురుగ్గా పాల్గొని సి ఎమ్ కప్పుతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు కూడా ఎంపికవ్వడం మా పాఠశాలకు ఎంతో గర్వకారణమని అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో సి ఎమ్ కఫ్ క్రీడలను అట్టహసంగా నిర్వహించిన పోటీలో పాల్గొన్న మా పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పద్దెనమిది మంది పాల్గొని కొండపాక మండలానికి ప్రథమ బహుమతి తేవడం ఎంతో అభినందనీయమని అన్నారు. రేపు జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు మా జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాల నుండి చింతల అనూష, బట్ట అక్షయ, బట్ట రాణి, కిన్నెర భవానిలతో పాటు రాగుల దినేష్,కిన్నెర మహేష్ తేజ, లు ఎంపికైనారనీ, ప్రధానోపాధ్యాయులు సి హెచ్ రామచంద్రం తెలిపారు. ఈ నెలలో అట్టహసంగా చేపట్టిన సి ఎమ్ కఫ్ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులను ఘనంగా సన్మానిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీ వి నర్సిరెడ్డి, ఎస్ బాల కనకయ్య, బి శ్రీనివాస్ రెడ్డి, శ్రీమతి పి భాగ్యలక్ష్మి, ఎం మల్లారెడ్డి, సిహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ గా భాధ్యతలు స్వీకరించిన చంద్రకళ



**మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా** పోలీస్ కమిషనర్ కార్యాలయం ఏవో (అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్) గా బి.చంద్రకళ శుక్రవారం భాధ్యతలు స్వీకరించారు. ఆనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వరంగల్ కమిషనరేట్ సెక్షన్ సూపరిండెంట్ గా భాధ్యతలు నిర్వహిస్తూ...ఏవో గా పదోన్నతిపై ఖమ్మం పోలీస్ కమిషనరెట్ కు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఈ రోజు ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో భాధ్యతలు చేపట్టారు. ఆనంతరం అడిషనల్ డీసీపీ ఆడ్మిన్ నరేష్ కుమార్, అడిషనల్ డీసీపీ లా%డ% ఆర్డర్ ప్రసాద్ రావుని మర్యాద పూర్వకంగా కలిశారు.

## అండర్ డ్రైనేజ్ పనులను ప్రారంభించిన మేయర్ శాంతి కోటేష్ గౌడ్,డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా



**మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ జవహర్ నగర్**

జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 22వ డివిజన్ న్యూ వెంకటేశ్వర కాలనీ (బీరప్ప గడ్డ) లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను జవహర్ నగర్ మున్సిపల్ జనరల్ నిధుల నుండి 5లక్షల మంజూరు చేసి మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ గుప్తా, పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని పలు డివిజన్లకు అభివృద్ధికి కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పాల్గొన్న కార్పొరేటర్లకు శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ శాంతి కోటేష్ గౌడ్,డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్త,కార్పొరేటర్ కుతాడి సాయి ,గౌడుగు వేణు, శారద మనోహర్ రెడ్డి, బింగి లావణ్య సతీష్ గౌడ్,బస్తి నాయకులు కానీ వాసులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరుల గౌసే పాక్కదర్గా గ్యార్వి షరీఫ్ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి



**మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ కీసర నాగారం** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ముస్లిం సోదరుల ఆహ్వానం మేరకు గౌసే పాక్క దర్గా గ్యార్వి షరీఫ్ కార్యక్రమానికి పాల్గొన్న నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ హిందూ ముస్లిం బేధాభిప్రాయాలు లేకుండా అందరూ కలిసికట్టుగా ఉండాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఎండి పాషా , కో ఆప్షన్ సభ్యులు ఎండి షఫీ ,షేక్ గౌస్, షేక్ జాంగిర్, ఎండి అంజాద్, లాల, నాగారం మున్సిపల్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు జాల బోయిన కృష్ణ యాదవ్ , ప్రవీణ్ యాదవ్ , మామిలా చంద్రశేఖర్ యాదవ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

## కేటీఆర్ పై పెట్టిన కేసును వెంటనే వాపస్ తీసుకోవాలని డిమాండ్ చేసిన దేవి రవీందర్



**మన ప్రజా ప్రతినిధి కొండపాక/కుక్కునూరు పల్లి మండల్**

రాజకీయంగా బిఆర్ఎస్ పార్టీని ఎదుర్కొనే దమ్ము లేక కాంగ్రెస్ ప్రభుత్వం కెసిఆర్ కుటుంబమే లక్ష్యంగా చేసుకొని కేటీఆర్ పై అక్రమ కేసును తీవ్రంగా ఖండిస్తున్నామని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ మండిపడ్డారు. అనంతరం కుకునూరు పల్లిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దేవి రవీందర్ మాట్లాడుతూ... కావాలని కాంగ్రెస్ పార్టీ కేటీఆర్ మీద తప్పుడు కేసు బనే ఇస్తుందన్నారు, ఇలాంటి దొంగ కేసులు కేటీఆర్ గారిని ఏం చేయలేవని టిఆర్ఎస్ పార్టీ ఆత్మ సైరాన్ని దెబ్బతీయ లేవు అన్నారు, తెలంగాణ ప్రజలు మీకు తగిన రీతిలో బుద్ధి చెప్తారని, ఎన్నికల్లో గెలిచి ఏడాది దాటిన లక్షలు వందలు అసలే ఆరోపణ ను నిరూపణ కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేదన్నారు, రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగంగా హైదరాబాద్ తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ ని దెబ్బ తీసే దుందుడుకు చర్యలు రేవంత్ రెడ్డి పతానికి దారితీస్తాయని, ఇప్పుడు తాజాగా రూ 45 కోట్లు ఫార్ములా ఈ రేసింగ్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిన మొత్తం గురించి ఒక అబద్ధాన్ని తెరమీదగా తెచ్చారని,2023 లో దేశంలో అనేక నగరాలను కాదని హైదరాబాదును ఫార్ములా ఈ రేస్ కోసం ఎంచుకోవడం మనకు గర్వకారణం అని ఈ రేసు నిర్వహించిన ప్రముఖ ప్రపంచ నగరాల్లో సరసన హైదరాబాదు రూల్ నిలబెట్టింది కేటీఆర్ అన్నారు, కాంగ్రెస్ రాగానే కేవలం కక్ష సాధింపుగా ఈ రేసును రద్దు చేసిందని ఇప్పుడు కేటీఆర్ మీద అక్రమ కేసులు బనాయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బచ్చలి మైపాల్, పోల రమేష్ గౌడ్, మామిడి కృష్ణ, దినేష్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఔరంగజేబు వారసుడు రిక్షాలు నడుపుతున్నాడు

### సీఎం యోగి ఆదిత్యనాథ్ సంచలన వ్యాఖ్యలు

**అయోధ్య, డిసెంబర్ 20:** సనాతన ధర్మం ప్రాముఖ్యత గురించి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ సనాతన ధర్మం సురక్షితంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉన్నారని అన్నారు. ఆపద సమయంలో ప్రతి వర్గానికి.. మతానికి ఆశ్రయం కల్పించిన ఏకైక మతం సనాతన ధర్మం అని చెప్పారు. అయితే ఇలా హిందువులకు ఎప్పుడైనా ఆశ్రయం ఇవ్వడం జరిగిందా అనడమే కాదు.. ఇప్పుడు బంగ్లాదేశ్‌లో, అంతకు ముందు పాకిస్థాన్‌లో, ఆఫ్ఘనిస్తాన్‌లో ఏం జరిగిందని ప్రశ్నించారు. అయోధ్యలో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ.. 'దేశంలోని సనాతన ధర్మానికి గర్వకారణమైన స్థలాలను ధ్వంసం చేసిన వ్యక్తులు ఎవరు? ఎందుకు అలా చేశారని తాను అడగాలనుకుంటున్నానని అన్నారు.

## అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు

### - సాదుల పవన్ కుమార్

**మన ప్రజాపతినిధి//నంగునూర్,** తెలంగాణలో ఇండ్లు లేని పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు జరుగుతోందని సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాదుల పవన్ కుమార్ తెలిపారు. శుక్రవారం నాడు నంగునూర్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహించారు. ఈ సందర్బంగా సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల ప్రకారం ప్రతి గ్రామంలో ఇందిరమ్మ కమిటీ వేశారనీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి అర్హులైనవారిని ఎంపిక చేశారని తెలిపారు. వచ్చే నాలుగేళ్లలో తెలంగాణలో 20 లక్షల మంది పేదల సొంతింటి కలను నిజం చేయాలని రేవంతన్న సర్కార్ ప్రణాళికలు సిద్ధం చేస్తోందనీ, ఈ



మేరకు ఏడాది 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ పథకంలో ఎలాంటి అవకతవకలు జరుగుకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్ రూపొందించిందనీ, ఆ యాప్ ద్వారా అర్హులను గుర్తిస్తున్నామని వెల్లడించారు. పేదల్లోనూ అతి పేదలను గుర్తించి ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. వివిధ దశల్లో ఇండ్ల నిర్మాణాలకు సంబంధించిన డేటాను యాప్ ద్వారా సేకరించి, ఆ సమాచారంతోనే బిల్లుల చెల్లింపు ప్రక్రియ ఉంటుందని అన్నారు. దరఖాస్తుదారులు మరణించి ఉంటే వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పిస్తారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని, తమకు ఇందిరమ్మ ఇల్లు వస్తుందో లేదో అనే అపోహ పెట్టుకోవద్దని పవన్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి. చంద్రకళ ఇందిరమ్మ కమిటీ మెంబర్లు శ్రీమతి తుపాకుల లావణ్య, , దాసరి కిషన్, మరియు గ్రామపంచాయతీ కారోబార్ అశోక్, ఫీల్ అసిస్టెంట్ నర్సింగరావు దరఖాస్తుదారులు తదితరులు పాల్గొనడం జరిగింది .

## 1,176 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 20:** దేశీయ స్టాక్ మార్కెట్లలో నష్టాల పర్వం కొనసాగుతోంది. వరుసగా ఐదో రోజు సూచీలు నష్టోయాయి. విదేశీ మదుపరుల అమ్మకాలు, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు మన మార్కెట్లపై ప్రభావం చూపాయి. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 1,176 పాయింట్లు నష్టపోయి 78,041కి పడిపోయింది. నిఫ్టీ 364 పాయింట్లు కోల్పోయి 23,587కి దిగజారింది.